క్లుప్తంగా

కుర్చీల విరాళం



పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న డివిజన్ మేనేజర్ శ్రావణి

రెబ్బెన: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన మండలంలోని తుంగెడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కాగజ్‌నగర్ డివిజన్ మేనేజర్ శ్రావణి గురువారం కుర్చీలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల హెచ్‌ఎం లింగన్న సన్మానించారు. ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మణ్, డిప్యూటీ మేనేజర్ రాకేశ్, డిప్యూటీ రేంజ్ అధికారి ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయురాలు వనిత, వాచర్ గంగయ్య పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిక్షణ



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు నెలల క్రితం ప్రారంభమైన కరాటే శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ చాపిడి కుమార్ మాట్లాడుతూ కరాటేతో విద్యార్థినులకు ఆత్మరక్షణతోపాటు క్రమశిక్షణ పెంపొందిస్తుందన్నారు. మూడునెలల శిక్షణతో విద్యార్థినులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్, పీఈటీతోపాటు ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని దొడ్డిగూడ గ్రామానికి చెందిన ఆత్రం మారుబాయి 108 వాహనంలో ప్రసవించగా ఆడ శిశువుకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ పవర్ రాజా, పైలెట్ భీంరావు తెలిపారు. గురువారం ఉదయం 4 గంటలకు మారుబాయిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు అధికమయ్యాయి. మార్గమధ్యన వాహనంలో ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని వాంకిడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు వారు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి: మండలంలోని సామేల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నాయకులు సామల రమేశ్, కిషన్, నాగభూషణ్, సంతోష్, మారుతి, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు రాయండి




హాల్‌టికెట్లతో విద్యార్థులు

కెరమెరి: ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను విద్యార్థులు నిర్భయంగా రాయాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని గోయగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 35 మంది పదో తరగతి విద్యార్థులకు గురువారం హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి భయం లేకుండా పరీక్ష రాయాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు రమేశ్, మురళి, విజేశ్, ప్రవీణ్, గణేశ్, విజయ, స్వప్న తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ ఖాళీ!

- కెరమెరిలో వైద్యం దైన్యం
- ఒక్క స్టాఫ్‌నర్సుతో నెట్టుకొస్తున్న వైనం
- ఇబ్బందుల్లో రోగులు



కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పేదలకు ప్రభుత్వం వైద్యం అందించాలనే లక్ష్యం బాగున్నా వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, ఎల్‌టీ ఇతర పోస్టులు భర్తీ చేయడంలో జిల్లా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా తొమ్మిది నెలలుగా వైద్యాధికారి లేకుండానే కెరమెరి పీహెచ్‌సీ కొనసాగుతోంది. ఫార్మసిస్టు నాలుగు రోజుల క్రితం వరకు అన్నీతానై నడిపించారు. కాగా, ఇటీవల ఆయనకు ప్రమోషన్ వచ్చింది. పీహెచ్‌సీలో ఒక్క స్టాఫ్‌నర్సుతో కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది.

కెరమెరి: పేరుకే పీహెచ్‌సీ..వైద్యం అందని దైన్యంగా మారింది. 9 నెలలుగా వైద్యుడు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నినెలలు డా.వినోద్ ఇక్కడ విధులు నిర్వహించి సొంత పోస్టింగ్‌పై వెళ్లడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో వైద్యం కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాధికారులు, సిబ్బందిని భర్తీ చేయాలని మండలవాసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. వైద్యులు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో వైద్యాధికారి కావలెను అని నోటిఫికేషన్ వేసినా వైద్యులు రాకపోవడంతో రోగులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొన్ని పీహెచ్‌సీల్లో అధికమంది సిబ్బంది ఉన్నా.. వారిని కెరమెరికి పంపించాలన్నా ధ్యాస అధికారుల్లో లేకపోవడం గమనార్హం.

మండలంలో..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 156 గ్రామాలు ఉన్నాయి. 8 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. మండలంలో మొత్తం 32543 జనాభా ఉంది. వారందరికి కెరమెరి ఒక్కటే ఆరోగ్య ఉపకేంద్రం. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఇక్కడికి రావాలి. వాస్తవంగా ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులు ఉండాల్సి ఉంది. ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు. ప్రతీరోజు 50 నుంచి 100 వరకు రోగులు వైద్యపరీక్షలు చేయించుకుంటారు. 24 గంటల పీహెచ్‌సీగా ఉన్నతీకరణ చేసినప్పటికి వైద్యాధికారులతోపాటు ఇతర సిబ్బందిని నియమించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రతీనెల 35 నుంచి 40 వరకు డెలివరీలు నమోదై జిల్లాలో మూడో స్థానంలో కెరమెరి పీహెచ్‌సీ ఉంది. అయినా అధికారులు సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



వైద్యాధికారి లేక ఖాళీగా ఉన్న కుర్చీ

డిప్యూటేషన్ రద్దుతో..

గతకొన్ని రోజుల క్రితం వరకు ఇక్కడ విధులు నిర్వహించిన స్టాఫ్‌నర్సులు, ఎల్‌టీల డిప్యూటేషన్ రద్దుతో వారందరు వారివారి సొంత పోస్టింగ్‌లకు వెళ్లారు. ఒక స్టాఫ్‌నర్సుతోపాటు ఫార్మసిస్ట్ ఇద్దరే ఉండగా ఇటీవల ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్ ప్రమోషన్‌పై భూపాలపల్లి జిల్లాకు వెళ్లారు. దీంతో ప్రస్తుతం ఒక్క స్టాఫ్‌నర్సు మాత్రమే విధులు నిర్వహిస్తోంది. రాత్రి విధులు నిర్వహిస్తే, పగలు పీహెచ్‌సీ ఖాళీగా ఉంటుంది. పగలు నిర్వహిస్తే రాత్రి, అప్పుడప్పుడు ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్), ఏఎన్‌ఎంలు వచ్చి తాత్కాలిక విధులు నిర్వహిస్తున్నారు. స్టాఫ్‌నర్సులు లేక డెలివరీ కేసులను రెఫర్ చేస్తున్నారు. ఏదైన ఎమర్జెన్సీ కేసు వస్తే ప్రాణాలు హరీ అనడమే తప్ప వేరే మార్గం లేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు.

భర్తీ చేయాలి



తొమ్మిది నెలలుగా వైద్యాధికారి లేకుండా పీహెచ్‌సీ కొనసాగుతుంది. మధ్యలో డిప్యూటేషన్ పై వచ్చినప్పటికి డాక్టర్ వెళ్లిపోయారు. అధికారులు పట్టించుకుని వెంటనే వైద్యాధికారిని భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలి.

– పెందోర్ మోతిరాం, ఎంపీపీ

ముగిసిన ఇంటర్ పరీక్షలు



దహెగాం: విద్యార్థులతో కేజీబీవీ సిబ్బంది

కౌటాల: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారంతో ముగిశాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి లోనికి అనుమతించారు. పరీక్షకు 299 మంది విద్యార్థులకు గాను 289 మంది హాజరయ్యారు. 10 మంది గైర్హజరయ్యారని సీఎస్ బాలకిషన్‌రావు, డీవో దౌలత్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష అనంతరం విద్యార్థులు ఆనందంతో గంతులు వేశారు.

దహెగాం: మండలంలో ఇంటర్ పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 128 మంది విద్యార్థులు ఉండగా 122 మంది పరీక్ష రాశారని, మిగతా ఆరుగురు గైర్హాజరైనట్లు సీఎస్, కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ తెలిపారు.



కౌటాలలో ఆనందం వ్యక్తం చేస్తున్న ఇంటర్ విద్యార్థులు

వినూత్న రీతిలో ఇంటి పన్ను వసూళ్లు

బెజ్జూర్: బెజ్జూర్ పంచాయతీలో ఇంటి పన్ను వసూళ్ల కోసం సిబ్బంది వినూత్న రీతిలో ముందుకు సాగుతున్నారు. మొండి బకాయిలు చెల్లించాలని ఇంటి ఎదుట కారోబార్, సిబ్బంది గురువారం బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రజలు ఇంటి పన్ను బకాయిలు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కారోబార్ వసంత్ కోరారు. కార్యదర్శి తుకారాం ఉన్నారు.



బైఠాయించి నిరసన తెలుపుతున్న సిబ్బంది

వరి పంట పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, శాస్త్రవేత్తలు

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడలో వరి పంటను గురువారం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. గ్రామంలో ఓ రైతు సాగు చేసిన వరి 45 రోజులకే పొట్టదశకు చేరుకోవడంతో ఆందోళన చెంది అధికారులకు ఫిర్యాదు చేశాడు. జగిత్యాల అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్, బెల్లంపల్లి, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి వ్యవసాయ సిబ్బంది, విత్తన కంపెనీ ప్రతినిధులు, డీలర్లు క్షేత్రస్థాయికి వెళ్లి పంటను పరిశీలించారు. నాటు పోసిన నాటి నుంచి ఇప్పటివరకు పంట కాలంతోపాటు చేసిన యాజమాన్య పద్ధతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రసీదులు పరిశీలించారు. 45 రోజులకే పొట్టదశకు చేరుకోవడానికి కారణాలు త్వరలో తెలియజేస్తామన్నారు. యాసంగి వరిసాగు పనులను జనవరి లోపు పూర్తి చేయాలని తద్వారా మంచి దిగుబడిని సాధించవచ్చని అన్నారు. అదును దాటి సాగు చేయడం వల్ల వేసవిలో ఎండతీవ్రత అధికంగా మారి దిగుబడులు తగ్గుతాయని సూచించారు. ఏవో మంజుల, ఏఈవో రాకేశ్, డీలర్ రాజేశ్వర్‌రావు, రైతులు ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



కేసీఆర్‌తో ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ సౌందర్య



బెజ్జూర్: మాజీ సీఎం కేసీఆర్‌తో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, తదితరులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లో బీఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డిలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కేసీఆర్ సూచించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

బెజ్జూర్: మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత కలిశారు. ఉద్యమ యువ నాయకుడు సామల రాజన్న, చింతలమానపల్లి మండలం అనుకోవడ గ్రామానికి చెందిన ఉమ మహేశ్ తదితరులు ఉన్నారు.

కౌటాల: మాజీ సీఎం కేసీఆర్‌ను సిర్పూర్(టి) నియోజకవర్గ నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ నాయకులతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో సిర్పూర్ నాయకులు మాజీ సీఎంను కలిశారు. బెజ్జూర్ జెడ్పీటీసీ పుష్పలత, నాయకుడు నక్క శంకర్, నియోజకవర్గ యూత్ నాయకులు ఉమా మహేశ్ ఉన్నారు.



కౌటాల: మాజీ సీఎంతో సిర్పూర్ నాయకులు

పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని కేజీబీవీలో చదువుతున్న 36 మంది పదో తరగతి విద్యార్థినులకు పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లను అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు ఉప్రె వినేష్, ప్రధాన కార్యదర్శి జగదీశ్, పాఠశాల ఎస్‌ఓ పద్మ, సీఆర్పీ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు పరిశీలన



పరిశీలిస్తున్న ఈజీఎస్ ఏపీవో మల్లయ్య

కెరమెరి: ఎండల్లో ఉపాధి పనులు చేయొద్దని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. మండలంలోని సుర్దాపూర్, కరంజివాడ గార్మ పంచాయతీల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ప్రతీరోజు రూ.270 కూలీ వచ్చేలా పని చేయొద్దని అన్నారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పని చేయాలన్నారు. ఆయన వెంట టీఏ, ఎఫ్ఏ ఉన్నారు.

నేడు వాహనాల వేలం

ఆసిఫాబాద్‌అర్బన్: వివిధ అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో జిల్లా అధికారి జ్యోతికిరణ్ సమక్షంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.దీపక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాల్గొనేవారు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

తిరుపతికి అవకాశం ఇవ్వాలి

తిర్యాణి: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా కోట్నాక తిరుపతికి అవకాశం ఇవ్వాలని పార్టీ నాయకులు కోరారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ తిరుపతి ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేశారని, భారత్ జోడో యాత్రలో భాగస్వామై రాహుల్ గాంధీతో దేశవ్యాప్తంగా 4080 కి.మీ పాదయాత్ర చేశారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మడావి హనుమంత్‌రావు, అర్క సుధాకర్, ఉయిక కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా శిక్షణ శిబిరానికి ప్రవీణ్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ సర్వే డిపార్ట్‌మెంట్‌లో సర్వే మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న సిద్ధం ప్రవీణ్ కోలిండియా పోటీల శిక్షణ శిబిరానికి ఎంపికయ్యాడు. మణుగూరులోని భద్రాద్రి స్టేడియంలో ఈనెల 18 నుంచి 23 వరకు నిర్వహించే శిక్షణ శిబిరంలో పాల్గొంటాడు. 2015 నుంచి ఇప్పటివరకు ఏటా నిర్వహించే కోలిండియా పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుకుంటున్నాడు. కబడ్డీపై పట్టు ఉన్న ఆయన గతంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఎనిమిదేళ్లుగా బెల్లంపల్లి ఏరియా నుంచి వివిధ స్థాయిల్లో ఏరియా, నియర్ బై ఏరియా, కంపెనీ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నాడు. కబడ్డీతో పాటు క్రికెట్, అథ్లెటిక్స్, హాకీ, ఫుట్‌బాల్ ఆటల్లో నైపుణ్యం కలిగిన ప్రవీణ్‌ను అధికారులు, క్రీడాకారులు అభినందించారు.



ప్రవీణ్

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

నార్నూర్: గాదిగూడ మండలంలోని గిరిజన గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మాజీ ఎంపీపీ రాథోడ్ గోవింద్‌నాయక్ అన్నారు. గురువారం గాదిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉట్నూర్ నుంచి గాదిగూడ మండలంలోని కొలామా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆర్టీసీ బస్సులు నడవలేక పోవడంతో ప్రయాణానికి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

భయం వీడి పరీక్షలు రాయండి

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షలు భయపడకుండా ప్రశాంతంగా రాయాలని డీఈవో యాదయ్య అన్నారు. మంచిర్యాల కార్మెల్ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి పదోతరగతి టాలెంట్ టెస్ట్–2024 పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మోడల్‌స్కూల్‌రాజీవ్ నగర్ సాయివర్షిత, రెండో బహుమతి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని కెవిన్, మూడో బహుమతి కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన హసిత సాధించారు. పట్టణ కమిటీ మొదటి స్థానం నారాయణ హైస్కూల్‌కు చెందిన సాయి రుచిత, రెండో బహుమతి శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన పవన్, మూడో బహుమతి క్రిష్ణవేణి హైస్కూల్‌కు చెందిన సహస్రలు, కేజీబీవీకి చెందిన వైష్ణవి స్కూల్ టాపర్‌గా నిలిచింది. స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్‌కు చెందిన రుత్విక్‌లు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ఎంఈవో పోచయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, కమిటీ సభ్యులు అభినవ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న డీఈవో యాదయ్య

పౌష్టికాహారంపై అవగాహన

భీమిని: పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఎర్లీ చైల్డ్‌కేర్, ప్రీ స్కూల్ కార్నర్ గురించి విద్యార్థుల తల్లులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను బాలింతలు, గర్భిణులకు తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిరా, అంగన్‌వాడీ టీచర్లు వేరోణిక, సునీత, వెంకటలక్ష్మి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: చిన్నారులకు, గర్భిణులకు మంచి పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వరూపరాణి, మమత సూచించారు. మండలంలోని అచలాపూర్, బోయపల్లి గ్రామాల్లో గురువారం పోషణపక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అచలాపూర్‌లో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన చేపట్టారు. చిరుధాన్యాలలో ఐరన్, ఫైబర్, ప్రోటిన్స్, జింక్ ఎక్కువగా ఉండి ఎక్కువ శక్తిని ఇస్తాయని, అటువంటి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని పెద్దంపేట గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీలత పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చేతుల శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

కోటపల్లి: గ్రామపంచాయతీల్లో ప్రతీరోజూ తప్పక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని ఎసన్‌వాయి, సర్వాయిపేట, సిర్సా గ్రామపంచాయతీలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా చేయించాలని, ప్లాస్టిక్ చెత్త కనబడకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు ట్రాక్టర్‌తో ఇంటింటా చెత్త సేకరణ చేసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. కంపోస్టు తయారీ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని కంపోస్టు ఎరువును నర్సరీ, పల్లె ప్రకృతి వనం మొక్కలకు వినియోగించాలన్నారు. నర్సరీలను పరిశీలించి వేసవి కాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలని ఉదయం సాయంత్రం నీటిని అందించాలన్నారు. వందశాతం ఇంటి పన్నులు వసూల్ చేయాలని, వేసవికాలం ఉన్నందునా గ్రామ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడాలని పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో అక్తర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు ప్రభుత్వ పురస్కారం

మంచిర్యాలటౌన్: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఎస్.పద్మకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ పురస్కారంను ప్రదానం చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీల ఆధ్వర్యంలో వుమెన్ అచీవర్స్ 2024అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఐసీడీఎస్ అధికారులు, ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న అంగన్‌వాడీ టీచర్ ఎస్.పద్మ